క్లుప్తంగా

తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి



ధర్నా చేస్తున్న ఏఎస్ఆర్ నగర్ వాసులు

టి.నరసాపురం: తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్ వాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సచివాలయం–1 వద్ద ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి హరికృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో గుడెల్లి వెంకట్రావు, అనుమోలు మురళి, మడకం సుధారాణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

భోజనం మెనూపై శిక్షణ

పోలవరం రూరల్: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం భోజనం మెనూ తదితర వివరాలపై ఎంఈఓ నరేంద్ర రాయ్ అవగాహన కల్పించారు. భోజన పథకంలో నిబంధనలు పాటించాలని సూచించారు. వంటశాలల వద్ద పరిశుభ్రత, పౌష్టికాహారం, మెనూ వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎల్ సత్యనారాయణ, ఎస్ఆర్పీ ఉప్పే మహాలక్ష్మయ్య, జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, సీఆర్పీ దిలీప్‌కుమార్, దామోదర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

బుట్టాయగూడెం: యోగాతో సంపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని తహసీల్దార్ పీవీ చలపతిరావు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ యోగా అనేది శ్వాస నియంత్రణ, ధ్యానంతో అభ్యాసం చేయాలన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల రక్తపోటు తగ్గడంతోపాటు రక్త ప్రసరణ మెరుగుపడుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, ఎంఈఓ తెల్లం బాబూరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, మండల పరిషత్ ఏఓ టి.బేబీ సరోజిని, ఏఎంఓ శిరమయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.


నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

టి.నరసాపురం: మర్రిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు, ఆర్‌డీఎస్ఎస్ పనులు నిర్వహణ నిమిత్తం ఈనెల 7 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీఆర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ద్వారకాతిరుమల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని వెంకటకృష్ణాపురం హెచ్‌క్యూ ఫీడర్ పనులు శనివారం నిర్వహించనున్నట్టు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రామన్నగూడెం, దేవినేనివారిగూడెం, హెచ్.లింగపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

గుండెనొప్పితో యువకుడి మృతి



సరియం రాజు (ఫైల్)

కుక్కునూరు: గుండెనొప్పితో శుక్రవారం మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన సరియం రాజు (27)కు మృతి చెందాడు. స్థానికులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజుకు గురువారం సాయంత్రం గ్యాస్ నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఆర్ఎంపీ వద్ద చికిత్స చేయించారు. రాత్రి నొప్పి తగ్గకపోవడంతో శుక్రవారం ఉదయం రాజును కుక్కునూరు పీహెచ్‌సీకి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. రాజు గత ప్రభుత్వంలో వలంటీర్‌గా విధులు నిర్వహించాడని, వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీరాభిమాని అని ఆ పార్టీ నాయకులు గుర్తుచేసుకున్నారు. తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

షెడ్ల నిర్మాణానికి విరాళం

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయ అభివృద్ధిలో భాగంగా చేపట్టనున్న షెడ్లు నిర్మాణానికి దాతలు సహకారం కొనసాగుతోందని ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. షెడ్ల నిర్మాణానికి నౌడు రామన్న నారాయణమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు గంగరాజు, సత్యనూకరాజు కుటుంబసభ్యులు రూ.50,116, మానవత తిరుపతి త్రిపుర రమేష్ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళంగా అందజేశారని తెలిపారు. దాతలకు అమ్మవారి శేషవస్త్రాన్ని ఇచ్చి వేద మంత్రాలతో సత్కరించారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీహోమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ పేర్కొంది.

రేషన్ కష్టాలు పునరావృతం

- షాపుల వద్ద నిరీక్షణ
- సుమారు మూడు కిలో మీటర్ల దూరంలో షాపులు




జిల్లెళ్లగూడెం జీసీసీ డిపో నుంచి రేషన్ తీసుకువెళుతున్న లబ్ధిదారులు

పోలవరం రూరల్: కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో రేషన్ సరుకుల కోసం గిరిజన లబ్ధిదారులు అనేక కష్టాలు పడుతున్నారు. పోలవరం మండలంలో మారుమూల ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో గిరిజనులు ఈ నెల రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లెళ్లగూడెం గ్రామంలో జీసీసీ స్టోర్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పంచాయతీ పరిధిలో సరిపల్లి, పేడ్రాల, ముత్యాలరావు పేట, కొత్త కుంకాల, పాత కుంకాల, రెడ్డి కుంకాల గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల నుంచి రేషన్ సరుకుల కోసం జిల్లెళ్లగూడెం గ్రామంలోని జీసీసీ గోడౌన్‌కు రావాలంటే మూడు కిలో మీటర్ల దూరం వెళ్లాలి. మనుగోపుల గ్రామంలో జీసీసీ డిపో ఉంది. ఈ డిపో పరిధిలో మనుగోపుల, రెడ్డి నాగంపాలెం, కోయనాగంపాలెం గ్రామల రేషన్ కార్డుదారులు మనుగోపుల డిపోకు రావాల్సిన పరిస్థితి. కూలీ పనులను మానుకుని ఎండల్లో డిపోలకు చేరుకుని సరుకులు తీసుకోవడానికి లబ్ధిదారులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో తమకు రేషన్ సరుకులు ఇంటి వద్దకే వచ్చి వాహనాలపై అందించే వారని వారు గుర్తుచేసుకుంటున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లకుండానే ఇంటి వద్దకే రేషన్ సరుకులు చేరుకునేవని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాహనాలను నిలుపుదల చేయడంతో అవస్థలు తప్పడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గ్రామంలో వాహనాలు ఉన్న యువకుల సహాయంతో రేషన్ లబ్ధిదారులు రేషన్ డిపోలకు రేషన్ తీసుకుంటున్నారు.

దూరాభారం

గత వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతి నెలా రేషన్ సరుకులు ఇంటి వద్దకే ఇవ్వడంతో ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గ్రామాల్లో గిరిజనులకు



జిల్లెళ్లగూడెం రేషన్ డిపో వద్ద రేషన్ కోసం వచ్చిన గిరిజనులు

సౌకర్యవంతంగా ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ సరుకులు అందించే ఎండీయు వాహనాలు రద్దు చేయడంతో ఈ నెల 1వ తేదీ నుంచి రేషన్ సరుకులు తీసుకునేందుకు పరిసర ప్రాంతాల్లోని రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ షాపులు 1 కిలో మీటరు నుంచి 3 కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. కూలిపనులు మానుకుని, ఎండ తీవ్రతను తట్టుకుంటూ రేషన్ షాపులకు వెళ్లి, అక్కడ గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ సరుకులు ప్రతి నెలా అందించే వాహనాలు రద్దు చేయడంతో ఆ వాహనదారుల కుటుంబాలు కూడా ఇబ్బందుల్లో పడ్డాయి. ఏజెన్సీలో తమ ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని ఎండీయూ వాహనాలను కొనసాగించాలని గిరిజన లబ్ధిదారులు కోరుతున్నారు.

విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

బుట్టాయగూడెం: ఇంటర్, ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన అవార్డులకు తమ విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు విద్యారోహిణి డిజిటల్ స్కూల్ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. కూచిపూడి అంజిబాబు, కణితి హర్షవర్ధన్, సోనిత్ శ్రీవాత్సవ్, సోము పార్థు అత్యధిక మార్కులు సాధించి అవార్డుకు ఎంపికయ్యారన్నారు. వీరికి ఈ నెల 9న ఏలూరు సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో రూ.20 వేల చెక్‌ను అందజేస్తారని తెలిపారు.

మాజీ మంత్రి వనిత పరామర్శ



బాలాజీని పరామర్శిస్తున్న మాజీ మంత్రి వనిత

ద్వారకాతిరుమల: అనారోగ్యంతో ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి గ్రామానికి చెందిన గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కోకన్వీనర్ వసంతాటి శ్రీనివాస్ కుమారుడు మణి బాలాజీని శుక్రవారం మాజీ హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. బాలాజీ గత కొద్దిరోజులుగా కామెర్లతో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో గత నెల 31న ఏలూరు ఆశ్రం ఆస్పత్రిలో చేర్చారు. వనిత పార్టీ నేతలతో కలిసి వసంతాటి శ్రీనివాస్‌తో, వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవి

వేలేరుపాడు: ఏటా వరదలతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు ప్రభుత్వమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. సీపీఎం వేలేరుపాడు మండల కమిటీ సమావేశం కొత్త వెంకటేశ్వర్లు అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రతి ఏటా జూన్, జూలై, ఆగస్టులో వచ్చే వరదల వల్ల మండలంలోని రైతాంగం వ్యవసాయం ఆలస్యంగా ప్రారంభించడమే గాక వరదల్లో ఒకటికి రెండుసార్లు పంటలు వేసి నష్టపోతున్నారని వివరించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు పేరుతో ప్రభుత్వం నుంచి ఇచ్చే సబ్సిడీ ఎరువులు విత్తనాలు లాంటి, పంట నష్టపరిహారం ఇవ్వకుండా విస్మరించడం తగదని అన్నారు. రానున్న వరదలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సహాయక చర్యలకు పూనుకోవాలని కోరారు. నిర్వాసితులకు కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా మండలాన్ని యూనిట్‌గా పరిహారం, పునరావాసం కల్పించాకే తరలించాలని రవి డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు తెల్లం నాగమణి, మండల కార్యదర్శి ధర్ముల రమేష్ మండల కమిటీ సభ్యులు మడివి దుర్గారావు, మడకం ఏసుబాబు, గుమ్మల వెంకట నర్సయ్య, శ్రీను ఉన్నారు.

మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

బుట్టాయగూడెం: యువత మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వైపు పయనించకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై దుర్గామహేశ్వరరావు అన్నారు. బుట్టాయగూడెం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటీవల గంజాయిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అయితే గ్రామాల్లో యువతకు గంజాయి, మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగించే విధంగా ప్రజా ప్రతినిధులు కూడా కృషి చేయాలని కోరారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఎం స్వర్ణకుమారి మాట్లాడుతూ 60 సెంట్లు భూమి ఉన్న రైతులకు గులాబీ, మల్లె తోటల పెంపకానికి కృషి చేస్తామన్నారు. రైతులు 12 సెంట్లు భూమి ఉన్న పాడి రైతులకు గడ్డి పెంపకానికి కూడా సహకరిస్తామని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో హార్టికల్చర్‌కు సంబంధించి మొక్కలు, జీడిమామిడి, పామాయిల్ మొక్కలను అందజేస్తామని తెలిపారు. ఐసీడీఎస్ సీడీపీఓ తులసి మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను మరింత విస్తృతంగా అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. పశువర్ధక శాఖ, పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా అందిస్తున్న పథకాలపైనా సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ చలపతిరావు, వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, వెలుగు ఏపీఎం పద్మావతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సమగ్ర యాజమాన్యంపై అవగాహన



డ్రోన్‌ల ద్వారా యూరియా వినియోగించే విధానాన్ని వివరిస్తున్న శాస్త్రవేత్తలు

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు, తూర్పురేగులకుంటలో శుక్రవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముందస్తు ఖరీఫ్ సీజన్ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు వి.దీప్తి, ఎ.దేవీ వరప్రసాద్ రెడ్డిలు మాట్లాడుతూ రైతులకు మినుము, పెసర, వరి పంటల సమగ్ర యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. సేంద్రియ వ్యవసాయ విధానాలు, సమగ్ర ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. పశుగ్రాసంలోని రకాలు, పాల ఉత్పత్తి పెరగడానికి సూచనలు, చేపలు, కోళ్ల పెంపకంపైనా వివరించారు. నానో యూరియా, డీఏపీ వాడకం డ్రోన్ వినియోగంపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ పరిశోధనా సంస్థ ప్రతినిధి డాక్టర్ మేరీరాణి, వ్యవసాయ గ్రామ సహాయ అధికారి ఉదయభాను, అభ్యుదయ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బాక్సు అందజేత



వెలమ సంక్షేమ సంఘానికి ఫ్రీజర్ బాక్సును అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక వెలమ సంక్షేమ సంఘానికి పోలుపర్తి నాగవేణు శుక్రవారం రూ.80 వేలు విలువైన ఫ్రీజర్ బాక్సు అందజేశారు. సంఘ అధ్యక్షుడు భీమరెడ్డి జోగిబాబు మాట్లాడుతూ నాగవేణు (పారెస్ట్ ఆఫీస్) తన తండ్రి నాగన్న, మాధవిల జ్ఞాపకార్థం ఫ్రీజర్ బాక్సు అందజేశారని తెలిపారు. కమిటీ సభ్యులు నాగవేణుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



రామన్నపాలెంలో రైతులతో కంభం విజయరాజు

కామవరపుకోట: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్య తీసుకోవాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు కోరారు. మండలంలో రామన్నపాలెం గ్రామంలో పొగాకు, కోకో, పామాయిల్ రైతులు ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారని, వారు ఇబ్బందులను పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని విజయరాజును కోరారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతు కూటమి ప్రభుత్వం పాలన చేపట్టినప్పటి నుంచి రైతుల సంక్షేమాన్ని గాలి వదిలేసిందన్నారు. పంటకు సరైన గిట్టుబాటు ధర రాక, పెట్టుబడి పెరిగి ఆర్థికంగా నష్టపోయి రైతులు అప్పుల పాలు అవుతున్నారని వివరించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు రూ.23 వేలు వరకు లభించిందని, కోకో గింజలు కిలో ధర రూ.800 నుంచి రూ.1200 వరకు లభించిందని గుర్తుచేశారు. ఇప్పుడు రైతులు సరైన గిట్టుబాటు ధర రాక రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



లోక్‌అదాలత్‌పై సమీక్ష చేస్తున్న జడ్జి మధుబాబు

చింతలపూడి : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జూలై 5న నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు కోరారు. శుక్రవారం కోర్టు ఆవరణంలో పోలీస్ అధికారులతో లోక్ అదాలత్‌పై సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులు పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజు ఫ్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ నిర్వహిస్తున్నామన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు బి.వెంకటేశ్వరరావు, పి.అశోక్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, కోర్ట్ కానిస్టేబుల్స్, కోర్టు పాల్గొన్నారు.

శారీరక వ్యాయామం అవసరం



బాలికలతో యోగాసనాలు వేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరి

ద్వారకాతిరుమల: కిశోర్ బాలికలకు శారీరక వ్యాయామం అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. మండలంలోని వేంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర్ వికాసం 2.0లో భాగంగా శారీరక వ్యాయామం, క్రీడలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మేరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలు శారీరక ఎదుగుదలతో పాటు ఆత్మ విశ్వాసానికి, మానసిక ఉల్లాసానికి దోహద పడతాయన్నారు. కనీసం రోజుకు 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలన్నారు. అనంతరం కిశోర్ బాలికలతో యోగాసనాలు వేయించారు. గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నాగలక్ష్మి, సావిత్రి, సౌజన్య పాల్గొన్నారు.

సద్దుమణిగిన మత్స్యకారుల వివాదం



ఎస్సైకి అంగీకారపత్రం అందజేస్తున్న మత్స్యకారులు

టి.నరసాపురం: రెండో మత్స్యకార సంఘం ఏర్పాటు అంశంపై తలెత్తిన వివాదం సద్దుమణిగినట్లు బొర్రంపాలెం మత్స్యకార సంఘం ప్రెసిడెంట్ బత్తుల రమేష్ తెలిపారు. మత్స్యకార ఇరువర్గాల మధ్య స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత, వైఎస్సార్ సీపీ నేత పెండ్యాల అభిషేక్‌బాబు మధ్యవర్తిత్వం వహించి సయోధ్య కుర్చినట్టు చెప్పారు. బొర్రంపాలెం పంచాయతీలో ఎర్రకాలువ జలాశయం మత్స్యకారుల సహకార సంఘం ఉందన్నారు. కొందరు స్వార్థపూరితంగా మత్స్యకారుల మధ్య చీలికి తెచ్చి రెండో సంఘం ఏర్పాటుకు ప్రయత్నించారని తెలిపారు. వార్డు సభ్యులు, మత్స్యకార సంఘానికి తెలియకుండా అక్రమంగా బొర్రంపాలెం పంచాయతీలో తీర్మానం చేయించడంతో మత్స్యకార సంఘం కలక్టరేట్ పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదుచేసిందన్నారు. దీనిపై మత్స్యకార ఉన్నతాధికారులు విచారణ చేసి ఎర్రకాలువ జలాశయానికి సంబంధించి రెండో సంఘం ఏర్పాటు కుదరదని తెల్చారని వివరించారు. పంచాయతీ తీర్మానం రద్దు చేస్తామని అధికారులు తెలిపారని చెప్పారు. ఈ నేపథ్యంలో కొందరు సుమారు 70 కేజీల చేపల వలలు పోయాయని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. విషయం తెలుసుకున్న అభిషేక్‌బాబు అధికారులు, ఎస్సై జయబాబుతో మాట్లాడారని, సంఘంలోని లేని వారు మత్స్యకార సంఘానికి వ్యతిరేకంగా పనిచేయమని, ఏదైన ఘటనలు ఎదరైతే సంఘం తీసుకునే చర్యలకు కట్టుబడి ఉంటామని అంగీకారం కుదుర్చారని వివరించారు. ఈ సందర్భంగా మత్స్యకారులు అభిషేక్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఫిర్యాదును మత్స్యకారులు ఉపసహరించుకుంటూ శాంతియుతంగా కలిసిమెలిసి ఉంటామంటూ ఎస్సైకు అంగీకారపత్రం అందజేశారు.

విజ్ఞాన శిబిరంలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన దృశ్యం

కొయ్యలగూడెం: వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులలోని ప్రతిభను మెరుగుపరచడానికి దోహద పడతాయని ఎంఈఓ జె.సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు శిక్షణను ఇచ్చిన స్పందన సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు బలుసు నాగేశ్వరరావు, రాష్ట్ర స్థాయి చెస్ క్రీడాకారుడు ఎస్‌బీజీ శేఖర్, సీఆర్పీ సీహెచ్ఎన్‌వీ రమణ, ఎక్కువ వికాస నిపుణుడు ఎండీ సిరాజు, ఏవీఆర్ ఎం.స్కూల్ అధినేత ఏవీ సీతారామరాజు, యోగా గురువు చవ్వా సూరిబాబులను విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు. బలుసు నాగేశ్వరరావు అందజేసిన షీల్డ్‌లను విజేతలైన విద్యార్థులకు అందజేశారు. ప్రముఖ తెలుగు రచయిత ఏవీడీ సత్యనారాయణమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు బహుమతులను ప్రశంసా పత్రాలను అందించారు.

ఎన్ఎంఎంఎస్‌కు రావికంపాడు విద్యార్థి



షేక్ మహమ్మద్ రెహ్మాన్

కామవరపుకోట: జాతీయ ఉపకార వేతనానికి రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న స్కాట్ విద్యార్థి షేక్ మహమ్మద్ రహ్మాన్ ఎంపికయినట్టు ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు తెలిపారు. ఎన్ఎంఎంఎస్ ప్రతిభ పరీక్షల్లో ఉత్తీర్ణత పొంది ఉపకార వేతనానికి ఎంపికయ్యాడన్నారు. రహ్మాన్‌కు ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుల బిరుదుగట్ల నాగేశ్వరావును ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం – తాడేపల్లిగూడెం రోడ్డులోని స్వయంభు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తాడికొండ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ అనిపెద్ది వెంకట నరసింహాశర్మ మూర్తి పర్యవేక్షణలో రూ.40 లక్షల విలువైన స్థలాన్ని విరాళంగా అందజేసిన దాత మన్నే వెంకటరత్నం చౌదరి(సింహపురి)తో కలిసి భక్తులు శంకుస్థాపన చేశారు. అధ్యక్షుడు తాడికొండ మురళికృష్ణ మాట్లాడుతూ రూ.30 లక్షల అంచనాతో ఆలయ నిర్మాణం గావిస్తామన్నారు. గౌరవ అధ్యక్షులు మేకల అన్నవరం, మట్టా సత్తిపండు, మంతెన సోమరాజు, ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ ఆలయ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

చింతలపూడి సీఐగా క్రాంతి కుమార్



క్రాంతి కుమార్, సీఐ

చింతలపూడి : చింతలపూడి సీఐగా టి.క్రాంతి కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో జీలుగుమిల్లి, పెద్దాపురం స్టేషన్లలో పని చేశారు. సర్కిల్‌లో శాంతి భద్రతల పరి రక్షణకు కషి చేస్తానని ఆయన తెలిపారు. కోడిపందాలు, పేకాట జూదాలపై కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజలు కూడా నేరాల అదుపునకు సహకరించాలని, ఎప్పటి కప్పుడు అప్రమత్తంగా ఉంటూ అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.